క్లుప్తంగా

33వసారి రక్తదానం



భిక్కనూరు: కాచాపూర్ గ్రామానికి చెందిన కైరం కొండ శ్రావణ్ కుమార్ బుధవారం 33వ పర్యాయం రక్తదానం చేశారు. బుధవారం ఆయన కామారెడ్డి పట్టణంలోని మహిళకు రక్తం అవసరం కాగా ఆయన అక్కడికి వెళ్లి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, తనను ఎవ్వరూ కోరిన రక్తదానం చేసేందుకు ఎప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు. శ్రావణ్ కుమార్‌ను గ్రామస్తులు, నేతలు పలువురు అభినందించారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



నిజాంసాగర్(జుక్కల్): తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామిని బుధవారం వేకువజామున సుప్రభాతసేవలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు దర్శించుకున్నారు. వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో జుక్కల్ నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, అభివృద్ధిలో ముందుండాలని స్వామివారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట ఎస్ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, సాయిపటేల్ తదితరులున్నారు.

ప్రీప్రైమరీ స్కూల్ ప్రారంభం



బిచ్కుంద(జుక్కల్): రాజుల్లాలో ప్రీప్రైమరీ పాఠశాలను బుధవారం ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక విద్య జీవిత అభ్యాసానికి పునాది వేస్తుందని, ఈ దశలోనే విద్యార్థుల సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద గుర్తించి పాఠశాలలో ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల మాదిరిగా మధ్యాహ్న భోజనం, మంచి వాతావరణం అన్ని వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఉపాధ్యాయులు రాంబాబు, సయ్యద్ ఇర్షాద్ అలీ, విజయ్, ఖయ్యూం, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు..



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం పాఠశాల విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. వ్యాయామ ఉపాధ్యాయులు భుజంగ్, ప్రవీణ్‌రెడ్డి విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి, జోనల్ స్థాయి పోటీలు నిర్వహించనున్నామని వారు అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు హన్మండ్లు స్వామి, విద్యార్థులున్నారు.

దేవుని చెరువు పరిశీలన



రాజంపేట: ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో రాజంపేట మండల కేంద్రంలోని దేవుని చెరువు కట్ట, అలుగులను ఇరిగేషన్ డీఈ సుష్మ పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా అలుగు పారడంతో పాటు రోడ్డు వైపు నీటి ప్రవాహానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వరద నీరు ఓవర్ ఫ్లో సమయంలో కాలువ ద్వారా నీరు పోయే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట ఎంపీడీవో బాలక్రిష్ణ, తహసీల్దార్ జానకి, పంచాయతీ కార్యదర్శి అశోక్, ఏఈ ఆనంద పాల్గొన్నారు.

సామర్థ్యాలకు అనుగుణంగా బోధించాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన చేయాలని ఎంఈవో షౌకత్‌అలీ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి బోధనోపకరణాలను ఉపయోగించి బోధించాలన్నారు. అలాగే విద్యార్థులకు ప్రతి రోజూ డీఎస్ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ తీసుకొని హాజరు శాతం పెంచాలని సూచించారు. కాంప్లెక్స్ హెచ్ఎం శోభారాణి, డీఆర్పీలు మహిపాల్, హరీష్, హరీష్ దర్శన్, సత్యనారాయణ, యశ్వంత్, సెక్రటరీలు రాములు, దత్తురాజు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూల మలుపులు.. ప్రమాదానికి పిలుపులు

- మండల కేంద్రంలోని పాత చెరువు మూల మలుపుల వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు
- పట్టించుకోని అధికారులు



చెట్ల పొదల్లో ఉన్న సూచిక బోర్డు



సదాశివనగర్ పాత చెరువు కట్టపై ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పాత చెరువు కట్టపై ఉన్న మూల మలుపుల వద్ద రోడ్డుకు ఇరు వైపులా పెరిగిన పిచ్చి మొక్కలతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిచ్చి మొక్కలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. గతంలో ఈ మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరిగినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుకు ఇరు వైపులా పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. వాటిని సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆర్ అండ్‌బీ అధికారులు దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ రోడ్డు గుండా ప్రతి రోజూ పరిమితికి మించి వాహనాలు వివిధ రకాల లోడ్‌లతో రాకపోకలు సాగిస్తున్నాయి. వాటిని నియంత్రించడం లేదు. భారీ వాహనాలు రోడ్డు గుండా వెళ్లడం వల్ల రోడ్డు దెబ్బతింటోంది. ఇదంతా జరుగుతున్నా అధికారులకు మాత్రం కనువిప్పు కలగడం లేదు.

చెట్ల పొదల్లో సూచిక బోర్డులు....

చెరువు కట్టపై ఉన్న మూల మలుపుల వద్ద అక్కడ ఏర్పాటు చేసిన ప్రమాద సూచిక బోర్డులు చెట్లు బాగా పెరిగి కనపడటం లేదు. బోర్డులు ఏర్పాటు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని వాహనదారులు పేర్కొంటున్నారు.

బోర్డులు పెట్టినా ఫలితం లేదు



చెరువు కట్టపై మూల మలుపుల వద్ద గతంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఆ బోర్డులు చెట్ల పొదల్లో కూరుకుపోయాయి. వాహనదారులకు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకునే ఆస్కారం ఉంది. అధికారులు పట్టించుకుని బోర్డులను సరి చేయాలి.

– చౌకి నాగరాజు, సదాశివనగర్

పిచ్చి మొక్కలను తొలగించాలి..



మండల కేంద్రంలోని పాత చెరువు కట్టపై రోడ్డుకు ఇరు వైపులా భారీగా పిచ్చి మొక్కలు పెరిగాయి. వాటిని తొలగించడం లేదు. పక్కనే చెరువు ఉండడం వల్ల భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పిచ్చి మొక్కలను తొలగించి ప్రమాదాల నుంచి కాపాడాల్సిన ఆవశ్యకత ఉంది.

– సీహెచ్ రంజిత్ కుమార్, సదాశివనగర్

రూ. 3 లక్షల విలువైన ఆట వస్తువుల అందజేత



ఆట వస్తువులతో చిన్నారులు, వైద్యులు, హెచ్ఎం, ఉపాధ్యాయులు

బాన్సువాడ: బాన్సువాడ సరస్వతి శిశు మందిర్‌కు బుధవారం డాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిల్లల వైద్యులు తోట కిరణ్ సహకారంతో రూ.3 లక్షల విలువ గల ఆట వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షుడు నాగులగామ వెంకన్న మాట్లాడుతూ.. శిశు మందిర్‌లో విద్యనభ్యసించే విద్యార్థులు శారీరక దృఢత్వంతో ఉండాలని, భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. స్వదేశీ పట్ల గౌరవాన్ని పెంపొందించుకోవాలని, సమాజానికి సేవ చేసే విద్యార్థులుగా తయారు కావాలని సూచించారు. ఆట వస్తువులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎం నాగిరెడ్డి, వైద్యులు తోట కిరణ్, శ్యాంసుందర్, జీవన్‌రెడ్డి, స్వాతిరెడ్డి, సంతోష్ రెడ్డి, పి.సుధ, సాయిలీల, సౌజన్య తదితరులున్నారు.

ప్రభుత్వ ఫార్మసీ అధికారుల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ ఫార్మసీ అధికారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా జి.వెంకటి, గౌరవ అధ్యక్షుడిగా నీల లింగయ్య, కార్యదర్శిగా కె.శ్రీనివాస్, కోశాధికారిగా బి.వెంకటేశం, ప్రధాన సలహాదారులుగా జె.రఘునాథ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో ఈ ఎన్నిక నిర్వహించారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార మేళా



భిక్కనూరు: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ నెల 12న శుక్రవారం నాలుగు మండలాల విద్యుత్ సమస్యల పరిష్కార మేళాను నిర్వహిస్తున్నట్లు భిక్కనూరు ట్రాన్స్‌కో ఏఈ సంకీర్త్ తెలిపారు. ఆయన బుధవారం భిక్కనూరులో మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం 10 గంటలకు భిక్కనూరు, రాజంపేట, దోమకొండ, బీబీపేట మండలాలకు సంబంధించిన విద్యుత్ సమస్యల పరిష్కార మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేళాలో ప్రజలు గృహజ్యోతి, జీరో బిల్, వ్యవసాయ కనెక్షన్‌లతో పాటు ఇతర సమస్యలపై నేరుగా వచ్చి ఫిర్యాదులు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కామారెడ్డి అర్బన్: చిన్నమల్లారెడ్డి విద్యుత్ ఫీడర్‌పై మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పట్టణ ఏడీఈ డి.కిరణ్‌చైతన్య తెలిపారు. నర్సన్నపల్లి, చిన్నమల్లారెడ్డి, రాజంపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వృథాగా పోతున్న తాగునీరు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): కాస్లాబాద్‌లో తాగునీరు వృథాగా రోడ్డుపై ప్రవహిస్తోంది. గ్రామస్తుల నీటి అవసరాన్ని తీర్చడానికి ఏర్పాటు చేసిన ట్యాంక్‌లో నీరు ప్రతిరోజు వృథాగా పోతుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి వృథా నీటిని అరికట్టాలని కోరుతున్నారు.

నీటి సమస్య పరిష్కరించండి



నస్రుల్లాబాద్: మండలంలోని మిర్జాపూర్‌లో గల 2, 3, 6వ వార్డులలో నీటి సమస్య తీర్చాలని కోరుతూ బుధవారం గ్రామస్తులు నిరసన తెలిపారు. మూడు నెలలుగా మిషన్ భగీరథ నీరు మురికిగా వస్తున్నాయని.. వాడుకోవడానికి కూడా నీరు లేక ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు పేర్కొన్నారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రమేష్, మొగులవ్వ, మోహన్, సురేష్, శ్రీకాంత్, అనిత, గంగామని తదితరులున్నారు.

అధ్వానంగా బ్రాహ్మణపల్లి-దేవాయిపల్లి రోడ్డు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి నుంచి దేవాయిపల్లి మీదుగా బ్రాహ్మణపల్లి వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా తయారైందని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని కోరుతున్నారు. కాంట్రాక్టర్లు నాసిరకం తారు వేయడంతో రోడ్డు కొదిపాటి వర్షానికే గుంతలమయంగా మారిందన్నారు. అలాగే ఈ మార్గంలో నిర్మించిన కల్వర్టు కూడా పూర్తిగా ధ్వంసమైందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రోడ్డును త్వరగా బాగు చేయించాలని కోరుతున్నారు.

మాచారెడ్డి సొసైటీని ముట్టడిస్తాం



రామారెడ్డి: రామారెడ్డి మండలంలోని మాచారెడ్డి సొసైటీ పరిధిలోకి వచ్చే 7 గ్రామాలకు మాచారెడ్డి సొసైటీ యూరియా పంపిణీ చేయడం లేదని, మరి ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేస్తున్నారో చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సలావత్ బుచ్చిరెడ్డి ప్రశ్నించారు. బుధవారం రామారెడ్డిలో ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. రైతులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాచారెడ్డి సొసైటీని ముట్టడిస్తామని హెచ్చరించారు. సొసైటీ చైర్మన్, సీఈవో యూరియా పంపిణీ గురించి స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, కలెక్టర్ స్పందించి 7 గ్రామాలకు యూరియా సరఫరా అయ్యే విధంగా చూడాలని కోరారు.

బకాయిలు విడుదల చేయాలి



బీవీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కామారెడ్డిఅర్బన్: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం బకాయిలు వెంటనే విడుదల చేయాలని భారతీయ విద్యార్థి మోర్చా(బీవీఎం) కామారెడ్డి జిల్లా శాఖ డిమాండ్ చేసింది. బుధవారం పట్టణంలోని ఆయా కళాశాలల విద్యార్థులు బీవీఎం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, నిజాంసాగర్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా విద్యార్థుల సమస్యలు పరిష్కరించలేకపోయిందని, దీవాళా కోరు ప్రకటనలకు పరిమితమైందని బీవీఎం రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విఠల్ ఆరోపించారు. సీఎం కామారెడ్డి పర్యటనకు ముందే బకాయిలు విడుదల చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. బీవీఎం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యశ్వంత్, అర్బస్‌ఖాన్, జిల్లా ఇన్‌చార్జి పి.బుల్లెట్ చక్రవర్తి, ప్రతినిధులు గడ్డం రవి, చిట్యాల లింగం, తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ తెగువ ఆదర్శం



బాన్సువాడలో ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పోచారం, కాసుల, సబ్ కలెక్టర్ కిరణ్మయి



కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో ఐలమ్మ వర్ధంతి నిర్వహిస్తున్న అధికారులు



కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..



బాన్సువాడ: బీజేపీ ఆధ్వర్యంలో..



జంగంపల్లిలో..



బిచ్కుందలో ..



ఎల్లారెడ్డిలో రజక సంఘం ఆధ్వర్యంలో..



శెట్పల్లిసంగారెడ్డిలో..



సదాశివనగర్‌లో..



మాచారెడ్డిలో..

సాక్షి నెట్‌వర్క్ : తెలంగాణ వీరనారి, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ తెగువ నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు సూచించారు. బుధవారం రజక సంఘం, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం పోరాటం చేసి తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పిన ఐలమ్మకు జోహార్లు అని అన్నారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు.

సీఎం సమీక్షలకే పరిమితమయ్యారు

- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



లింగంపల్లి(ఖుర్దు) వద్ద పాముల వాగు వంతెనను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): భారీ వర్షాలకు పోచారం అలుగు పక్కన కట్ట, కళ్యాణి ప్రాజెక్టు, చెరువులు తెగిపోయి తీవ్ర నష్టం వాటిల్లితే ఆ ప్రదేశాలకు వెళ్లకుండా లింగంపల్లి బ్రిడ్జిని మాత్రమే సీఎం పరిశీలించి సమీక్షలకే పరిమితమయ్యారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత జాజాల సురేందర్ విమర్శించారు. దెబ్బతిన్న వాటికి నేటికీ మరమ్మతులు చేపట్టకపోవడంపై సీఎం చిత్తశుద్ధి ఇదేనా అని ప్రశ్నించారు. వర్షాలకు లింగంపల్లి(ఖుర్దు) వద్ద పాముల వంతెన కొట్టుకుపోవడంతో బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హైలెవెల్ వంతెన తెగిపోయి రాకపోకలు నిలిచిపోయాయని, అధికారులు చేయించిన తాత్కాలిక మరమ్మతులు నాణ్యతగా లేకపోవడంతో నేటికీ భారీ వాహనాలు వెళ్లడం లేదన్నారు. మరమ్మతులు చేసిన బ్రిడ్జి అప్పుడే కుంగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం లింగంపల్లి శివారులోని మల్లారం చెరువు కట్టను పరిశీలించారు. భారీ వర్షాలకు చెరువు కట్ట తెగిపోవడంతో ఆయకట్టు కింద రైతుల పొలాల్లో ఇసుక మేటలు వేశాయన్నారు. నష్టపోయిన రైతులకు త్వరగా పరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, నేతలు గన్నూనాయక్, శ్రీకాంత్‌రెడ్డి, రాములు, లక్ష్మణ్, తదితరులున్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



నస్రుల్లాబాద్‌లో నగదు అందిస్తున్న గ్రామస్తులు



పోతాయిపల్లిలో నగదు అందజేస్తున్న దాతలు

నస్రుల్లాబాద్: నస్రుల్లాబాద్ గ్రామానికి చెందిన చాకలి కిష్టవ్వ శనివారం చనిపోయింది. గ్రామ కమిటీ రూ.10వేలు అందించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలు ప్రతి ఇంటికి అందించిన సేవలను గుర్తించి గ్రామస్తులు బుధవారం ఆమె కుటుంబ సభ్యులకు రూ.20, 461 నగదును అందించారు. ఆమె కుటుంబానికి గ్రామస్తులు అండగా ఉంటామని భరోసా ఇవ్వడానికే ఈ నగదు అందించామని ఈ సందర్భంగా గ్రామస్తులు అన్నారు. గ్రామ కమిటీ చైర్మన్ కంది మల్లేష్, మాజీ సర్పంచ్ అరిగె సాయిలు, మాజీ ఎంపీటీసీ శంకర్ నాయక్, తదితరులున్నారు.

ఇల్లు కూలిపోయిన బాధితులకు..

లింగంపేట(ఎల్లారెడ్డి): పోతాయిపల్లి గ్రామానికి చెందిన వరద బాధితులకు బుధవారం దాతలు ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఇల్లు కూలిపోయి నిరాశ్రయులైన ప్రభాకర్, అల్లెవ్వ, సాయిలులకు దాతలు సిరిసిల్ల సమీపంలోని సుద్దుల గ్రామానికి చెందిన వేణు, ప్రకాష్, చందు, ప్రశాంత్‌తో పాటు కామారెడ్డి జిల్లాకు చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు రూ. 3 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు.

సంక్షిప్తం

విద్యార్థులు భవిష్యత్తులో రాణించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): విద్యార్థులు ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో రాణించాలని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు నృత్యాలు చేసి ఉర్రుతలూగించారు. కళాశాల ప్రిన్సిపాల్ సింగం శ్రీనివాస్, రామారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దాబాలలో మద్యం సిట్టింగ్‌లకు అనుమతిస్తే కేసులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): దాబాలలో మద్యం తాగడానికి అనుమతిస్తే కేసులు తప్పవని ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. బుధవారం చిన్నతక్కడ్‌పల్లి చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారి–161 పక్కన ఉన్న 36 దాబాలో లైసెన్స్, అనుమతి లేకుండా మద్యం అనుమతించడంతో ప్రమాదాలకు కారణం అవుతుందని 35 ఫ్యామిలీ దాబాలను తాత్కాలికంగా మూసివేసినట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో భవన నిర్మాణ కార్మికులు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్మికులు ప్రమాదవశాత్తూ మృతి చెందితే వారి కుటుంబాలకు ప్రమాద బీమా 10 లక్షలకు పెంచడంతో పాటు సహజ మరణం పొందిన వారికి రూ.2 లక్షలకు పెంచడాన్ని హర్షిస్తూ వారు పాలాభిషేకం చేశారు. కార్మికులు లక్ష్మణ్, సాయిబాబా తదితరులున్నారు.

దుర్గామాత మండప నిర్మాణానికి భూమి పూజ

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించనున్న దుర్గామాత మండప నిర్మాణానికి బుధవారం అర్చకుడు శశికాంత్ శర్మ, క్లబ్ సభ్యులు భూమి పూజ చేశారు. ఈ నెల 22 నుంచి నిర్వహించే దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. క్లబ్ సభ్యులు ద్యావరి నరేష్, ఉరుదొండ నరేష్, గోలి నరేష్, హన్మంత్‌యాదవ్, ద్యావరి నవీన్, నీలం శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తాం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రతిక్షణం పోరాటం చేస్తామని మండల కిసాన్ సంఘం కార్యదర్శి బోడి రాజు యాదవ్ పేర్కొన్నారు. బుధవారం బేగంపూర్, కాస్లాబాద్ గ్రామాల రైతులతో సమావేశమై కిసాన్ సంఘం లక్ష్యాలు.. పని తీరుపై రైతులకు వివరించారు. అనంతరం బేగంపూర్, కాస్లాబాద్ గ్రామాల భారతీయ కిసాన్ సంఘం నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. బేగంపూర్ గ్రామ అధ్యక్షుడిగా అవినాష్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా పుట్టల అంబయ్య, కార్యదర్శిగా పెద్దోళ్ల సాయిలు, కాస్లాబాద్ అధ్యక్షుడిగా అరవింద్, ఉపాధ్యక్షుడిగా కత్తూరి శంకర్, కార్యదర్శిగా కొండ సంతోష్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షుడు జైత్రం, బాన్సువాడ డివిజన్ సభ్యులు దేవి సింగ్ పాల్గొన్నారు.